తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# చిరుత హల్‌చల్

**పాఠశాలలో ప్రవేశించిన పులి..బంధించిన అటవీ సిబ్బంది**
**- కుప్పం సరిహద్దు తిరుపత్తూరులో ఘటన !!**


స్కూల్‌లో ప్రవేశించిన చిరుతపులి

కుప్పం, జూన్ 15 ప్రభాతవార్త

పట్టపగలే ఓ చిరుతపులి ఓ పాఠశాలలోకి ప్రవేశించి హల్‌చల్ చేసిన సంఘటన కుప్పం సరిహద్దుల్లోని తిరుపత్తూరులో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. తిరుపత్తూరు పట్టణంలోని సిఎస్ఐ హయ్యర్ సెకండరీ స్కూల్‌లోకి శుక్రవారం ఓ చిరుతపులి ప్రవేశించింది. అక్కడున్న ఇద్దరు వ్యక్తులపై దాడికి దిగగా వారు బ్రతుకుజీవుడా అంటూ ప్రాణాలు కాపాడుకుని పరుగులు తీశారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు వ్యక్తులను చికిత్స నిమిత్తం కృష్ణగిరి ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా పాఠశాలలో చిరుతను చూసిన బాలికలు పరుగులు తీశారు. అనంతరం చిరుత పులి పాఠశాల నుంచి పక్కనే ఉన్న కాలనీలోని జనావాసాల్లో ప్రవేశించింది. దీంతో కాలనీ వాసులు హడలెత్తిపోయారు. విషయాన్ని తమిళనాడు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం కాలనీలో దాక్కొని ఉన్న చిరుతను ఎట్టకేలకు అటవీ సిబ్బంది బంధించారు. దీంతో అక్కడి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

**అది తప్పుడు ప్రచారం : డిఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి**

తమిళనాడులో చిరుతపులిని బంధించిన తమిళనాడు అటవీ అధికారులు చిరుతపులిని హొసూరు అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని చెప్పి కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం వీర్నమల అటవీ ప్రాంతంలో చిరుతను వదిలిపెట్టారని సోషియల్ మీడియాలో పోస్టులు వచ్చాయి. ఈవిషయంగా చిత్తూరు డిఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డిని 'ప్రభాతవార్త' వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి కూడా వచ్చిందని తాను కూడా తమిళనాడు, స్థానిక అటవీ అధికారులతో మాట్లాడానని ఇది ఫేక్ సమాచారం అని ప్రజలు ఎవరూ భయాందోళనలు చెందవద్దని సూచించారు.

# అందరికీ మంచి జరగాలి

**సినీనటులు మంచులక్ష్మి,ప్రగ్యాజైస్వాల్**

తిరుమల, జూన్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:
శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలకు మంచిజరగాలని వేడుకున్నట్లు సినీ నటులు మంచు లక్ష్మి, ప్రగ్యాజైస్వాల్ తెలిపారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# పెద్దిరెడ్డి గోబ్యాక్...

**ఊర్లోకి వచ్చేప్రయత్నం చేయద్దు : తెలుగు తమ్ముళ్లు**
**పుంగనూరులో ఉద్రిక్తత.. భగ్గుమన్న దేశం శ్రేణులు**
**రద్దయిన ఎమ్మెల్యే పర్యటన -ఇద్దరు వైకాపా నేతలపై దాడులు**


రోడ్డుపై బైటాయించిన తెలుగుతమ్ముళ్లు

పుంగనూరు, జూన్ 15 ప్రభాతవార్త :

మా పెద్దాయన వస్తున్నాడు, మీ అంతుచూస్తారని కొందరు చేసిన వాఖ్యలు ఒక్క సారిగా పుంగనూరులో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించాయి. పెద్దఎత్తున దేశం శ్రేణులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలకు దిగారు. దీంతో శనివారం ఉదయం పట్టణానికి రావాల్సిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ఉదయం పట్టణానికి వచ్చి వైకాపా కార్యకర్తలను ముఖాముఖి కలుస్తారని వైకాపాశ్రేణులకు తెల్లవారుజామున సమాచారం అందింది. దీంతో సమావేశ స్థలం చేరుకునేందుకు వైకాపా నాయకులు సిద్ధమయ్యారు. ఈక్రమంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన అనుచిత వాఖ్యల సంఘటన దేశం నాయకులను రెచ్చగొట్టింది. ఫలితంగా ఒక్కసారిగా పట్టణంలోనికి వేలాదిగా దేశం కార్యకర్తలు చేరుకున్నారు. పుంగనూరులో దారుణపరిస్థితులకు కారణమైన పెద్దిరెడ్డి పట్టణానికి రావడానికి వీల్లేదంటూ నాగప్పాలెం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాపాల పెద్దిరెడి గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బైటాయించి ఉద్రిక్త సృష్టించారు. ఇదే సమయంలో సంఘటనా స్థలానికి దగ్గరే ఉన్న పిఎంకే ఉడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి ఇంటి వద్ద ఆందోళకారులు గుమికూడడంతో పోలీసులు చెదరగొట్టారు. ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద పెద్దఎత్తున చేరుకుని ఆందోళన చేస్తున్న దేశం కార్యకర్తలు తీవ్ర ఆగ్రహా వేశాలతో ఊగిపోయారు. గతంలో తమ నాయకుడు చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నాయకుడి హోదాలో పుంగనూరు బైపాస్‌లో వెడుతుండగా రాళ్ళతో కొట్టించారని, కుప్పంలో ఆయన నియోజకవర్గంలోనే రానివ్వలేదని ఆరోపించారు. ఇదే క్రమంలో పోలీసులను అడ్డుపెట్టుకుని వేలాది మంది అమాయక ప్రజలు, దేశం మద్దతుదారులు, దేశంశ్రేణులపై పోలీసులు కేసులు పెట్టించి దారుణాలకు పాల్పడ్డారన్నారు. మొన్నటి వరకు వందలాది మంది కార్యకర్తలు తమ ఇండ్లకు దూరమై గోవాతో పాటూ ఇతర ప్రాంతాలలో దాక్కొని కుటుంబాలకు దూరమై వేదన పడ్డారని ఆరో పించారు. పుంగనూరు నియోజకవర్గంలో దారుణాలు సృష్టించి, సాధారణ ప్రజాజీవితాన్ని దుర్భరంచేసిన పెద్దిరెడ్డి పుంగనూరుకు రావడానికి వీల్లేదని ఆగ్రహించారు. ఈక్రమంలో పుంగనూరులో ఉద్రిక్తత ఉందని తెలియడంతో తిరుపతి నుంచే ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డిలు తమ పర్యటనలు వాయిదా వేసుకున్నట్లు తెలియడంతో ఆందోళనాకారులు వెనక్కుతగ్గారు. అయితే, తనపై దేశం నాయకులు దాడులు చేశారని మాజీ ఎంపిపి నర్సింహులు, తనను హత్యచేయడానికి ప్రయ్నతం జరిగిందని వెంకటరెడ్డియాదవ్ పేర్కొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న తెలుగుదేశం నాయకులు

# ఇద్దరు జిల్లా ఎస్పీలు బదిలీ!

**త్వరలో పోలీసుశాఖలో బదిలీలు**

తిరుపతి, జూన్ 15ప్రభాతవార్త:
రాష్ట్రంలో నూతన కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో చేపట్టనున్న ఐపిఎస్‌ల బదిలీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలు బదిలీ కానున్నారు. ఈ ఇద్దరు ఐపిఎస్ అధికారులు ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో నియమితులయ్యారు. తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు ఓట్ల లెక్కింపుకు రెండు రోజుల ముందు బాధ్యతలు చేపట్టగా, చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠచందోలు ఎన్నికల ముందు చిత్తూరు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విషయం విదితమే. ఈ ఇద్దరు అధికారులు జిల్లాల్లో సమర్ధవంతంగా ఎన్నికల ప్రక్రియ ముగించారు. అయితే ఈ రెండు జిల్లాల్లో ఉన్న పరిస్థితులు దృష్ట్యా బదిలీ కాకతప్పదని తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లాలు కావడంతో ఇక్కడ తనదైన శైలిలో మంచి పరిపాలన దక్షత, అన్ని విధాలా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలనియంత్రణ చర్యలు తీసుకునే వారికి ప్రాధాన్యత నివ్వనున్నారనేది పోలీసుశాఖలో వినిపిస్తుంది. ఇద్దరు జిల్లా ఎస్పీలు నూతనంగా నియమితులైన తరువాత ఎన్నికల సమయంలో కీలకమైన స్థానాల్లో నియమితులైన అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు దాదాపు పూర్తిగా అన్ని స్టేషన్‌లల నుండి ఇతర స్థానాల్లో పోస్టింగ్ ఇవ్వాలనే ఆలోచన అటు పార్టీ వర్గాల్లో ఇటు ప్రభుత్వంలో ఉంది. మరి రెండు రోజుల్లో రెండు జిల్లాలకు కొత్త ఎస్పీలు రానున్నారనేది విశ్వసనీయ సమాచారం.

# తిరుమలలో భక్తుల రద్దీ


శనివారం ఉదయానికి కిటకిటలాడుతున్న తిరుమల

# పల్లె ప్రజలకు పక్కాగా వైద్య సేవలు

**- జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్**



యాదమరి, జూన్ 15 ప్రభాతవార్త:
పల్లె ప్రాంత ప్రజలకు 104 సంచార వైద్య వాహనం ద్వారా పక్కాగా వైద్య సేవలు అందించాలని జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ ఆదేశించారు. యాదమరి మండలం బండివాండ్లవూరు గ్రామంలో 104 సంచార వైద్య శిబిరం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను శనివరం జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుదర్శన్ ప్రజలకు అందిస్తున్న సేవల్లో 104 సంచార వాహనంలో రోగులకు అవసరమైన పరికరాలు ఏవి వున్నాయో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా అందించడానికి ప్రభుత్వం 104 ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఈ వాహనంతో పాటు వైద్య సిబ్బంది చిన్న జబ్బులకు ఇక్కడే చికిత్స చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు సైతం నెల రోజులకు పరిపడ మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ యాదమరి పిహెచ్‌సిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, అనసూయమ్మ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో బక్రీద్

**- జంతువులను వధించినా, అక్రమంగా తరలించిన కఠిన చర్యలు**
**- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు**
**- కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలులు**

చిత్తూరు, జూన్ 15 ప్రభాతవార్త:
శాంతియుత వాతావరణంలో ముస్లీం సోదరులు బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలని, బక్రీద్ పురస్కరించుకుని జంతువులను వధించినా, అక్రమంగా తరలించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలులు పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలో సోమవారం జరుగనున్న బక్రీద్ పండుగ పురస్కరించుకుని కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలులు ముస్లీం మత పెద్దలు, వివిధ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ అధ్వర్యంలో జిల్లా స్థాయి, పంచాయతీల స్థాయిలో జంతు సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని మసీదుల పరిసరాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టేలా జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమీషనర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ జిల్లాలో ఈద్-ఉల్-అజా(బక్రీద్) సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భద్రత ఏర్పాట్లకు సంబంధించి ఎలాంటి సమస్యలు వున్నా పోలీసు శాఖ తరపున అడ్మిన్ ఎస్పీ ఆరీఫుల్లాను నోడల్ ఆఫీసర్‌గా నియమించడం జరిగిందన్నారు. ఎలాంటి సమస్య వున్నా అడ్మిన్ ఎస్పీ ఆరీఫుల్లా దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, శిక్షణా కలెక్టర్ హిమవంశీ, అడ్మిన్ ఎస్పీ ఆరీఫుల్లా, జడ్పీ సిఇఓ గ్లోరియా, పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఇడి హరినాధరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, మున్సిపల్ కమీషనర్లు, ముస్లీం మత పెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


బక్రీద్ నిర్వహణపై ముస్లీం మత పెద్దలు, అధికారులతో సమావేశమైన కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలు.

# బాబూ...వినవా గణపయ్య గోడు...!

**వివాదాలు, అవినీతి అక్రమాలకు కేంద్ర బింధువుగా కాణిపాకం ఆలయం**
**టీటీడీ తరహాలో కాణిపాకం ఆలయంలో ప్రక్షాళన జరిగేనా?**

కాణిపాకం, జూన్ 15 ప్రభాతవార్త:
సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఆలయ అధికారుల అనాలోచిన నిర్ణయాలతో మితిమీరిన రాజకీయజోక్యంతో ఆలయ ప్రతిష్ట మసకబారింది. గత కొంత కాలం క్రితం వరకు ఆధ్యాత్మికతకు, ప్రశాంతతకు నిలయంగా వుంటూ దినదినాభావృద్ధి చెందుతూ రాష్ట్రంలోనే ప్రముఖ ఆలయాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న కాణిపాకం ఆలయం గత మూడు సంవత్సరాల కాలంలో అధికారుల అవినీతి అక్రమాలు, మితిమీరిన రాజకీయ జోక్యం కారణంగా వరస వివాదాలకు కేంద్ర బింధువుగా మారింది. కానుకల రూపంలో భక్తులు సమర్పించిన సొమ్మును తమ స్వార్థ ప్రయోజనాల కోసం లక్షలాది రూపాయలు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుచేశారనే అరోపణలున్నాయి. ఆలయ దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులు కావలసిన కనీస వసతుల కల్పనకే చర్యలు తీసుకోవాల్సిన ఆలయ ఉన్నతాధికారులు భక్తుల నుండి అధికారికంగా దోపిడీ కార్యక్రమంను అమలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆలయ ఉన్నతాధికారి రెండు దఫాలుగా ఇక్కడ ఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన తన ఏక పక్ష నిర్ణయాలతో ఆలయంలో పనిచేసే ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది పలు రకాలుగా వేధింపులకు గురిచేస్తూ వచ్చారనే విమర్శలున్నాయి. తనకు ఎదురు తిరిగిన వారిని, తనకు అనుకూలంగా లేనివారి పట్ల కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతూ వస్తున్నారనే ఆరోపణలున్నాయి. దేవస్థానం వద్ద నున్న ఈఓ క్వార్టర్స్‌లో లక్షలాది రూపాయలు దేవుడి సొమ్ముతో సకల సదుపాయాలు ఏర్పాటు చేసుకుని క్యాంపు కార్యాలయం అని బోర్డు పెట్టి నెలల తరబడి ఇంటి అద్దె చెల్లించకుండా ప్రభుతాన్ని మోసం చేశారనే ఆరోపణలున్నాయి. అలాగే తమ స్వప్రయోజనాల కోసం దేవస్థానంలో లోక కళ్యాణం పేరిట నిర్వహించిన పూజలకు గత ప్రభుత్వంకు అనుకూలంగా వున్న స్వామీజీలను రప్పించి లక్షలాది రూపాయలు దేవుడి సొమ్మును మంచినీళ్ళ ప్రాయంగా



ఖర్చుచేశారనే అరోపణలున్నాయి. డిల్లీ, వారణాసి వంటి ప్రాంతాల్లో నిర్వహించిన స్వామివారి కళ్యాణం, గణపతిహోమంలకు ఆలయ అధికారులు కుటుంబసమేతంగా విమానాల్లో ప్రయాణిస్తూ, స్వామివారి విగ్రహాలను మాత్రం రైళ్లలో తరలించి ఆలయ ప్రతిష్టను దెబ్బతీయడం అప్పట్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ముఖ్యంగా తన ఇష్టానుసారంగా ఆలయంలో ఎటువంటి నోటిఫికేషన్‌లు లేకుండా సుమారు 20 మంది వరకు ఉద్యోగ నియామకాలు చేసిన విషయం వివాదంగా తయారైంది. అలాగే దేవస్థానంలో స్వామివారికి సమర్పించిన కానుకను మాయం చేశారనే ఆరోపణపై ఇన్‌చార్జి ప్రధానఅర్చకుడిని సస్పెండ్ చేసిన ఆలయ ఉన్నతాధికారి తాము ఆలయానికి విరాళంగా అందించిన అమ్మవారి విగ్రహాన్ని రశీదు ఇవ్వకుండా మాయం చేశారని దాతలు మీడియా ముఖ ంగా ఓ అర్చకునిపై ఆరోపణలు చేసినా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా తనకు అనుకూలమైన వ్యక్తి కావడంతో అతనికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇన్‌చార్జి ప్రధాన అర్చకుడిగా పదోన్నతి కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం తీవ్ర వివాదాస్పదమైంది. అలాగే దేవస్థానంలో ఏళ్ళనాటి నుండి అమలులో వున్న వంశపారంపర్య అర్చకత్వానికి తూట్లు పొడుస్తూ తమకు అనుకూలమైన బయట ప్రాంతాల నుండి వచ్చిన అర్చకులకు ప్రధాన ఆలయంలో విధులు కేటాయించడం మరో వివాదాస్పదమైంది. ముఖ్యంగా తమకు అనుకూలమైన కొంత మంది అర్చకులు, వేదపండితులతో కమీషనర్ అనుమతి లేకున్నా వైదిక కమిటీని ఏర్పాటు చేసి దేవస్థానంలో పనిచేసే అర్చకులు, సిబ్బందిని పలు రకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తమకు అనుకూలంగా లేని అర్చకులు, ఉద్యోగుల పట్ల కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా వారికి ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలను సైతం నెలల తరబడి చెల్లించకుండా వేదిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆలయంలో జరిగే అంతర్గత బదిలీల్లో సైతం కమీషనర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ అయిన వారి ఆకుల్లో కాని వారికి కంచంలో అన్న రీతిలో నియామకాలు చేపడుతూ వచ్చారనే విమర్శలున్నాయి. అదేవిధంగా ఆలయంలో జరుగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధి పనుల కాంట్రాక్ట్‌లు, టెండర్ల విషయంలో పలు అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. గత మూడేళ్ళ కాలంలో ఆలయ ఉన్నతాధికారిగా కాకుండా జిల్లాకు చెందిన ఓ మంత్రి అండదండలు చూసుకుని పెట్రేగిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత 20 ఏళ్ళ క్రితం ప్రజా ప్రయోజనాల కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనాలను సైతం కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా గత కొద్ది నెలల క్రితం కూల్చివేయడం గమనార్హం. దేవస్థానం వద్ద గత మూడేళ్ళ కాలంలో ఎన్నడూ లేని విధంగా దళారి వ్యవస్థ వేళ్ళూనుకుంది. కొంత మంది ఉద్యోగులే విఐపిల దర్శనాల పేరుతో దళారీలుగా అవతారమెత్తి ప్రతిరోజూ వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఆలయ అభివృద్ధి కోసం తమ భూములను అందజేసిన స్థానిక రైతులకు, ఆలయ ఉభయదారులకు సైతం స్వామివారి దర్శనాల్లో కట్టుబాట్లు విధించడం స్థానికంగా పెద్ద వివాదంగా తయారైంది. ఆలయ ఉన్నతాధికారి పనిచేస్తూ దేవస్థానం క్వార్టర్స్‌లో కాపురమంటూ ఎన్నికల ముందు తప్పుడు చిరునామాతో స్థానిక పంచాయితీలో కుటుంబ సభ్యులతో సహా ఓటర్లుగా నమోదు కావడం అప్పట్లో వివాదాస్పదమైంది. సిబ్బందిపై ఈఓ భౌతిక దాడులను పాల్పడటం తీవ్ర వివాదాస్పదమైంది. ఆలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కథనాలు రాసే విలేకరుల పట్ల కూడా ఆలయ ఉన్నతా ధికారి దురుసుగా ప్రవర్తిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేస్తూ బెదిరింపులకు పాల్పడటం గమనార్హం.

# ఉద్యోగస్తులలో మొదలైన గుబులు

**అధికార పార్టీ నాయకులు చుట్టూ ప్రదక్షణలు**

తిరుపతిరూరల్, జూన్ 14 ప్రభాతవార్త:
తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే గత ప్రభుత్వంతో అంటకాగిన అన్ని డిపార్టుమెంట్స్‌లోని ఉద్యోగసులలో భయం మొదలైంది. ఎక్కడికి బదిలీ చేస్తారో...గతంలో చేసిన తప్పిదాలను నుండి ఎలా తప్పించుకోవాలో, ఎలా కప్పిపుచ్చుకోవాలో అని ఉద్యోగులలో గుబులు పట్టుకుంది. వివిధ ప్రభుత్వశాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రక్షాళన చేసే దిశగా అధికార పార్టీ అడుగులు వేస్తుందనే విశ్వసనీయ సమాచారం. ఉద్యోగులు ఇప్పటికే తాము చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవటానికి అధికార పార్టీ నాయకుల ఇండ్ల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ, బదిలీలు నిలుపుదల చేసుకొనుటకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తిరుపతిరూరల్ మండలంలో పేరూరు గ్రామ పంచాయతీ కార్యధర్శి, సాయినగర్, మంగళం, తిరుమలనగర్,, రణధీరపురం గ్రామ పంచాయతీల ఇన్‌చార్జి కార్యధర్శి డిపిఓ కార్యాలయానికి బదిలీ అయిన విషయం తెల్సిందే. ప్రధానంగా రెవెన్యూ, మండల, అధికారులతో పాటు విఆర్వోలు, పంచాయతీ కార్యధర్శులు, పోలీసు, సబ్ రిజిస్ట్రర్, ఎక్సైజ్. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి తదితర శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులకు స్థాన చలనం తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి.



## మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేసిన వారికి

రూ.1.80 లక్షలు జరిమానా

చిత్తూరు, జూన్ 15 ప్రభాతవార్త:

మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వాహనదారులు ఒకొక్కరికి 10 వేల రూపాయల చొప్పున 18 మందికి 1.80 లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ విఎన్ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి సూచనలతో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ పరిస్థితుల్లో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబుకు మద్యం సేవించి వాహనాలు పడుపుతూ 18 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వీరిని శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు ఎదుట హాజరు పరచగా జడ్జి ఉమాదేవి ఒకొక్కరికి 10 వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు మాట్లాడుతూ ఈ ఏడు నెలల వ్యవధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 223 మంది వాహనదారులు పట్టుబడ్డారని వీరి నుండి 16 లక్షల రూపాయల మేరకు జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే సెక్షన్ 185 కింద మొదటిసారి నేరం చేస్తే 10 వేల రూపాయలు జరిమానా లేదా 6 నెలల జైలు శిక్ష లేదా రెండును విధించవచ్చునన్నారు. అలాగే మద్యం సేవించి పోలీసులకు రెండవ సారి పట్టుబడితే 15 వేల రూపాయల జరిమానా లేదా 3 సంవత్సరాల జైలు లేదా రెండు విధించవచ్చునని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వి.కోట, జూన్ 15, ప్రభాతవార్త:



రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడిఅక్కడే మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని దాసార్లపల్లె వద్ద పలమనేరు-కుప్పం జాతీయ రహదారిపై గ్యాస్ సిలిండరు లారీ అదుపుతప్పి ముందు వళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న రామకు ప్పంకు చెందిన అబ్దుల్ రోఫ్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందడం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## కార్యకర్తలకు అందుబాటులో ఉంటాం

-మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడా

పలమనేరు, జూన్ 15, ప్రభాతవార్త:



వైకాపా నాయకులు, కార్యకర్తలతో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడా తెలిపారు. శనివారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఆయన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి కష్ట, సుఖాలలో తోడుంటానని తెలిపారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన పలమనేరు వైకాపా రూరల్ అధ్యక్షులు బాలాజీ నాయుడు పరామర్శించి ధైర్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయడమే నా ధ్యేయం

కేవీబీ పురం, జూన్ 15 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సిఎం చంద్రబాబునాయుడు నాపై ఉంచిన నమ్మకాన్ని నేను అభివృద్ధి పథంలో నా నియోజకవర్గ తీసుకెళ్తానని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. కేవీబీ పురంలో ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూలులో శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామాంజనేయులు నాయుడు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి మంజూరు చేసిన పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, తదితర కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఆయనకు మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేని శాలువలతో, పూలమాలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రామాంజులనాయుడు, రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ మండల నాయకుడు మొగిలి మునస్వామి యాదవ్, టీఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు తెరని జయరాంరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు పావని, వరలక్ష్మి, మల్లికార్జున్‌రెడ్డి, మండల గ్రామ కమిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పరందామిరెడ్డి, ఏ.శివరావు, మండల బీజేపీ అధ్యక్షుడు మునిశేఖర్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు థామస్, టీడీపీ పార్టీ యూత్ అధ్యక్షులు లక్ష్మిపతిరాజు, సురుటుపల్లి డైరెక్టర్ బాలిపెద్ది సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ భారతి, చెంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునికృష్ణ, మాజీ ఎంపీపీ మని, సర్పంచ్ పొన్నూరు బాలాజీ, సర్పంచ్ వెంకటేశ్వరులు, తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబు, కందస్వామి, మండల తహసీల్దార్ శ్రీరాముల నాయక్, మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మిపతి, రవికుమార్, సీఆర్పీలు మోడల్ స్కూలు ఉపాధ్యాయులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## దొంగలించబడ్డ సొత్తు లభ్యం

-స్వామివారి మహిమగా పూజలు

చౌడేపల్లి, జూన్ 15 ప్రభాతవార్త



దొంగలించబడ్డ సొత్తు లభ్యం కావడంతో ప్రసన్న ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామిల మహిమగా బాధితులు విశేష పూజలు నిర్వహించారు. టిటిడి టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ భాను ప్రకాష్ కథనం మేరకు...కర్ణాటకరాష్ట్రం శ్రీనివాసపురం తాలూకా పందివారిపల్లి నారమ్మ ఇంట్లో వారం రోజుల క్రితం 30గ్రాముల బంగారం దొంగలించబడింది. చుట్టు పక్కవారిని విచారించినా ప్రయోజనం లేకపోవడంతో రాజనాలబండ మహిమ తెలుసుకొని ఇక్కడికి వచ్చారు. అనుమానితుల వద్ద ప్రమాణం చేయించదలచిన బాధితురాలు అందరినీ బండకు రావాలని కోరింది. దీంతో తరువాత రోజు ఉదయాన్నే తన బంగారం ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తులు పడేవారు. స్వామివారి మహిమతో తన సొత్తు లభ్యమయ్యిందని గ్రామస్తులతో కలిసివచ్చి ఆలయం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు కృష్ణమూర్తి, గ్రామ పెద్దలు వెంకట్రెడ్డి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గన్నారు.

## ఎమ్మెల్యేను సత్కరించిన అఖిత భారతీయ యాదవ మహాసభ

చిత్తూరురూరల్, జూన్ 15 ప్రభాతవార్త:



చిత్తూరు శాసన సభ్యులు గురజాల జగన్మో హన్‌ను అఖిల భారతీయ యాదవ మహాసభ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి ఆయనను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ ప్రతినిధులు చిట్టిబాబు కొల్లా, కవితాసురేష్, అశోక్‌ఆనంద్ యాదవ్, పయణియాదవ్, గుణశేఖర్, డైరీమణి, కృష్ణయ్య, నాగరాజా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు ఉచిత న్యాయసేవలు

- డిఎల్ఎస్ఏ సివిల్ జడ్జీ వెన్నెల

చిత్తూరురూరల్, జూన్ 15 ప్రభాతవార్త :



నిరాశ్రయులకు అండగా వుంటూ ఉచిత న్యాయసేవలు అందిస్తామని డిఎల్ఎస్ఏ సివిల్‌జడ్జీ ఎస్‌పి.డి. వెన్నెల పేర్కొన్నారు. న్యూ కయనికట్టు వీధిలో మెప్మా, నగరసాలకసంస్థ సహకారంతో సపోర్టుసంస్థ అధ్యక్షులు జోసప్‌రాజజ్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయులు వసతి గృహాన్ని జడ్జీ తనిఖీ చేసారు. నిరాశ్రయులకు అందిస్తున్న సేవలు, వసతుల గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు నిరాశ్రయులైన వితంతువులకు ఉచితంగా న్యాయసేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోవసతిగృహ సిబ్బంది ప్రమీళ, శ్రీనివాస, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగకు ఏర్పాట్లు సిద్ధం

-సయ్యద్‌సుహేల్

పుంగనూరు, జూన్ 15 ప్రభాతవార్త:



బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించడానికి దేశం ఇన్‌చార్జి చల్లాబాబు అధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని సీనియర్ నాయకుడు సయ్యద్‌సుహేల్ తెలిపారు. పండుగ సందర్భంగా ముస్లింలు నమాజ్ నిర్వహించుకునే నానాసాహెబ్‌పేట వద్ద ఈద్గా మైదానాన్ని పరిశుభ్రంచేసే కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. ప్రశాంతమైన వాతావరణంలో ముస్లింసోదరులు పండుగ నిర్వహించుకోవాలన్నారు. మున్సిపల్ పారిశుద్దసిబ్బంది ఈద్గామైదానం వద్ద చర్యలు చేపట్టారు. పండుగ రోజున తమ నాయకుడు చల్లాబాబు ముస్లింమైనార్టీలను కలసి పండుగ శుభాకాంక్షలు తెలుపుతారన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## క్లీన్ సిటీగా చిత్తూరు

- పారిశుధ్యంపై ఎమ్మెల్యే గురజాల ప్రత్యేక శ్రద్ధ

చిత్తూరు, జూన్ 15 ప్రభాతవార్త:



చిత్తూరు నగరంను క్లీన్ సిటీగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కంకణం కట్టుకుని ముందడుగు వేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు శనివారం 42, 44 డివిజన్లలోని వన్నియర్‌బ్లాక్, రంగాచ్చారి వీధుల్లో అకస్మికంగా పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణతో కలిసి వీధుల్లో తిరిగి స్థానిక మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వన్నియర్ బ్లాక్ పరిధిలోని వన్నియర్ బ్లాక్, బుచ్చిశెట్టివీధి, గుర్రప్పనాయుడు వీధి, రేణుకాంబ వీధి, పడవేటమ్మ వీధుల్లో ఎమ్మెల్యే తిరిగి ప్రజల నుండి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన డ్రైనేజీ కాలువలు, దెబ్బతిన్న కల్వర్టుల సమస్యలను అక్కడికక్కడే అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. మంచినీటి పైపులైన్లు ఎక్కువగా వున్న చోట ఒక్కటే పెద్ద పైపు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే కాలువల్లో పూర్తి స్థాయి పూడికలు తొలగించాలని, కల్వర్టులు, కాలువల నిర్మాణాలకు సంబంధించిన టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అనంతరం రంగాచ్చారి వీధి పరిధిలోని సామిరెడ్డివీధి, గోల్డ్ మార్కెట్, ఫిష్‌మార్కెట్, కూరగాయల మూర్కెట్, హాస్పిటల్ రోడ్, బాణాల వీధుల్లో ఎమ్మెల్యే పర్యటించి పారిశుధ్య పనులు, మురికి కాలువలను పరిశీలించారు. నగర పరిధిలోని మురికి కాలువల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని, పారిశుధ్య పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. చిత్తూరును క్లీన్ సిటీగా తీర్చిదిద్దడానికి ప్రజలు తనవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్, హౌసింగ్ ఎఇ శ్రీధర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ లోకనాథం, వార్డు కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు సంక్షేమం ఇచ్చేది..అభివృద్ధి చేసేది సిఎం చంద్రబాబే

- ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూన్ 15 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రజలకు సంక్షేమం ఇచ్చేది, అభివృద్ధి చేసేది సిఎం చంద్రబాబు నాయు డేనని ఎమ్మెల్సీ, సమన్వ య కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నా రు. శనివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో పింఛన్ల సొమ్మును ఆరువేలకు సిఎం చంద్రబాబునాయుడు పెంచడంతో దివ్యాంగులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ కేక్ కట్ చేసి దివ్యాంగులకు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజే 16347 టీచర్ల పోస్టుల భర్తీకై మెగా డిఎస్సీ, దివ్యాంగులకు 6వేలకు పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2022 రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై సిఎం చంద్రబాబునాయుడు ఐదు సంతకాలు పెట్టారన్నారు. రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న ఆకాంక్షలను సిఎం చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేర్చుతారన్నారు. ప్రజల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని సైతం అంశాల వారీగా అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా మలచుతారన్నారు. కార్యక్రమాల్లో చంద్రబాబు కార్యదర్శి మనోహర్, నేతలు కన్నన్, మంజు, అప్పు, మహేంద్ర, జయరాంనాయుడు, చలపతి, సుబ్బు, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.

## 18న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, జూన్ 15 ప్రభాతవార్త:

కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక('పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సగిలి షన్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అన్నాక్యాంటీన్ మళ్లీ ప్రారంభం

:ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ

వెంకటగిరి జూన్ 15 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా లోని వెంకటగిరి నియోజకవర్గం లో తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలో రావడంతో త్వరలో అన్ని నియోజకవర్గ కేంద్రాలల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అదేశాలు మేరకు అన్న క్యాంటీన్‌లు ప్రారంభించడం జరుగుతుందని వెంకటగిరి టిడిపి ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని గతంలో ఉన్న అన్న క్యాటీన్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఇదే ప్రాంతంలో అన్న క్యాటీన్ మళ్ళీ ప్రారంభించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పట్టణంలోని పోలి శెట్టిగుంట పార్కు కూడా పరిశీలించారు. అయితే పార్కుల నిధులు దుర్వినియోగం గురించి ప్రత్యేకంగా ఉన్నతాదికారులచే విచారణ చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి, డక్కిలి, బాలయపల్లి మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళిరెడ్డి, కోటిరెడ్డి పార్టీ నాయుకులు బీరం రాజ్వేరరరావు, కెవికె ప్రసాద్, తదితరులు పాల్గోన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో నీటిఎద్దడి లేకుండా చూడండి

- ఎంపిపి అనిల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట, జూన్ 15 ప్రభాతవార్త



సూళ్లూరుపేట మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం మండల సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం మంచినీటి ఎద్దడి వచ్చే అవకాశాలు ఉన్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామ సర్పంచుల సహకారంతో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ అధికారులు రైతులకు వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా వారికి సహకరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేటు స్కూల్ బస్సులు నిబంధనలకు వ్యతిరేకంగా, అతివేగంగా వెళుతూ ప్రమాదాలకు గురిచేస్తున్నారని.. దీన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని మండల విద్యాశాఖ అధికారులను కోరారు. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గోపాలకృష్ణ, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, జూన్ 15 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరుకు వెళ్లి మంత్రి నారాయణను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని సతీష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు చిట్టేటి పెరుమాళ్లు, దంతాల రవి, నాపా మునిరాజా, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, మంజుల, బండారు శారద, బండారు ఆంజనేయులు, జక్కల బాలయ్య, సుబ్బయ్య, బుజ్జయ్య, మెస్ రమణయ్య, తిరుపతి, బట్టా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## నెలవలను అభినందించిన తడ మండల వైసీపీ నాయకులు

తడ, జూన్ 15 ప్రభాతవార్త



తడ మండలంలో అప్పుడే రాజకీయం రంగులు మారుతోంది. అధికారం దూరం కావడంతో వైసీపీ నాయకులు పచ్చ గొడుగు కిందకు చేరుకుంటున్నారు. ఇంత కుముందు ఎమ్మెల్యేగా పనిచేసిన నెలవల సుబ్రహ్మణ్యంతో ఉన్న అనుబంధంతో అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకులు మళ్లీ నెలవలను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం టిడిపి ఎమ్మెల్యేగా నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె విజయశ్రీ ఉండటం గమనార్హం. నాయుడుపేటలో నెలవలను కలిసిన వారిలో తడ ఎంపిపి కొళవి రఘురెడ్డితో పాటు డిసిఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, మండల వైసీపీ బిసి సెల్ అధ్యక్షుడు ఉచ్చూరు మునుస్వామిరెడ్డి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పాలా మహేశ్వర్, వెండ్లూరుపాడు సర్పంచ్ చిల్లకూరు మునిరత్నంరెడ్డి, దేవేంద్రరెడ్డి, నరేష్‌రెడ్డి, సుబ్బారావు, చల్లయ్య, తడ మాజీ సర్పంచ్ జయకృష్ణ, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

## మంత్రి జన్మదిన వేడుకల్లో భారతమ్మ దంపతులు

- సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పాలుపంచుకున్న చిట్టమూరు మండల నాయకులు

చిట్టమూరు, జూన్ 15 ప్రభాతవార్త



రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన వేడుకల్లో చిట్టమూరు మాజీ జడ్పిటిసి, సీనియర్ టిడిపి మహిళా నాయకురాలు భారతమ్మ, చిట్టిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. శనివారం మంత్రి నారాయణ నివాసంలో వేడుకలకు హాజరై బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మంత్రి నారాయణ హయాంలోనే చిట్టమూరు మండలానికి నిధులు సమకూర్చి మండల అభివృద్ధికి విశేషంగా భారతమ్మ కృషి చేశారు. చిట్టమూరు మండల పరిధిలోని గొల్లలనట్టు, వెలుగాజులపల్లి రోడ్డు మరమ్మతులు, ఎల్లూరు పంచాయతీలోని గొల్లలనట్టు గిరిజన కాలనీకి రహదారి నిర్మాణం, తీరప్రాంతాల్లో సిమెంటు రోడ్లు మంజూరుకు కృషి చేశారు. అలాగే దుగరాజపట్నం రోడ్డు నుంచి పల్లంపర్తి వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారి వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టి, మల్లాం పురవీధుల్లో ట్రాఫిక్ నియంత్రణకు భారతమ్మ విశేషంగా కృషి చేశారు. రానున్న ఐదేళ్ల కాలంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ సారథ్యంలో మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నట్లు భారతమ్మ, చిట్టిరెడ్డిలు ఈ సందర్భంగా 'ప్రభాతవార్త'కు తెలియజేశారు. అలాగే గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సారథ్యంలో మంత్రి నారాయణ జన్మదిన వేడుకలకు హాజరైన మండల టిడిపి కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు, మారంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి తదితరులు పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## భవిత స్కూలులో విద్యార్థులకు కిట్స్ పంపిణీ

సూళ్లూరుపేట, జూన్ 15 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని భవిత పాఠశాలలో వాసవీ క్లబ్‌కు చెందిన పేర్ల వెంకటసత్యనారాయణ, వెంకట సుప్రజ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులైన విద్యార్థులకు స్టుడెంట్ కిట్స్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిల్ బాక్సులు, విద్యాసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్‌కు చెందిన బండారు శబరీష్ గుప్తా, సాయిరాం, సునీత, శ్యాంబాబు, వనితా క్లబ్‌కు చెందిన నిర్మలకుమారి, సౌజన్య, దుర్గి రమేష్, హనుమంతరావు, సురేష్, నాగేశ్వరరావు, పద్మజ, కళావతి, హనుమంతరావు, భవిత స్కూలు ఉపాధ్యాయురాలు భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## చిరంజీవి సేవా సంఘంచే ఆర్థికసాయం

సూళ్లూరుపేట, జూన్ 15 ప్రభాతవార్త



మెగాస్టార్ చిరంజీవి సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక గణపతినగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న అట్లూరు లక్ష్మి అనే మహిళకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. అట్లూరు లక్ష్మికి అనారోగ్యంతో ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి నెలకొనడంతో సుమారు రూ.50 వేలు అవుతుందని డాక్టర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చిరంజీవి సేవాసంఘం అధ్యక్షులు మాబాషా ప్రత్యేక చొరవతో రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని తనవంతుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటి, శివకుమార్, భాను, నవీన్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో సమస్యలను పరిష్కరించండి

సూళ్లూరుపేట, జూన్ 15 ప్రభాతవార్త



సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు ఎం.శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి శనివారం వినతిపత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం డిపో సమస్యలపై దృష్టి సారించా లని ఆమెను కోరారు. డిపో పరిధిలో అవసరమైన బస్సులు లేక ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తిరుపతి సెక్టార్‌లో ప్రవేశపెట్టిన హైర్ బస్సులను ఆరునెలలకే నిలిపివేశారని, తిరుమల, బెంగళూరు, మదనపల్లి, కాకినాడ, హైదరాబాద్ బస్సులను రద్దు చేశారన్నారు. ఈ బస్సులన్నింటినీ పునరుద్ధరించడంతో పాటు డిపోలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని డిపో కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మిక నాయకులు శేఖర్, రమణయ్య, వెంకటేశ్వర్లు, శంకరయ్య, మణ్యం, షాజహాన్, రమణయ్య, భూపయ్య, మనోహర్, జగన్నాథం, టిఎస్ రెడ్డి, ఇస్మాయిల్, మల్లికార్జున్, సుబ్బయ్య, మూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల మధ్య వివాదం

కోట, జూన్ 15 ప్రభాతవార్త

కోట మండలం కొత్తపట్నం పంచాయతీ రెవెన్యూ పరిధిలో యమదిన్నెపాలెం గ్రామంలో 708 సర్వే నంబర్‌లో కృష్ణపట్నం కంపెనీ వారు నిర్మించిన ప్రహరీ గోడలోపల ప్రాంగణంలో యమదిన్నెపాలెం గ్రామస్థులు వేరుశనగ పంట సాగు చేస్తున్నారు. అయితే చిల్లకూరు మండలం మన్నేగుంట గ్రామానికి చెందిన కొందరు రైతులు సాగు చేస్తున్న భూమి తమ తాత ముత్తాతలకు సంబంధించినదని, ఆ భూముల్లో ఎలా పంటలు సాగు చేస్తారని యమదిన్నెపాలెం రైతులతో వాదనకు దిగారు. ఇరు గ్రామాల రైతుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ నాగబాబు, సర్వేయర్, విఆర్ఓ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

## 29, 30 తేదీల్లో కోటమ్మ ఉత్సవాలు

కోట, జూన్ 15 ప్రభాతవార్త



మండల కేంద్రమైన కోటలో వెలసిన శ్రీ కోటమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఆ మేరకు ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మవారి పరివార దేవతామూర్తులు ఆలయాలకు రంగులు దిద్దుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది కోటమ్మ తల్లి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. 29న ఉదయం 4 గంటలకు సముద్ర జలాలను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేస్తారని తెలిపారు.

## ఆటోబోల్తా - నలుగురికి తీవ్రగాయాలు

దొరవారిసత్రం జూన్ 15 ప్రభాతవార్త

మండలంలోని మీజూరు సమీపంలో ఆటోబోల్తాపడి నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. సేకరించిన సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి. ఆటో ప్రయాణికులతో సూళ్ళూరుపేట నుండి మీజూరుకు వెళ్ళుతుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఆటోబోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సుబ్బమ్మ, విజయ, రాజేశ్వరమ్మ, ప్రదీప్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108 సహాయంతో చికిత్సనిమిత్తం సూళ్ళూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరళించారు. దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బడిలోనే బడిఈడు పిల్లలు

- జులై 12 వరకు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్
- జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య


నేను బడికి పోతా కార్యక్రమంపై అధికారులతో డిఆర్‌ఓ పుల్లయ్య సమీక్ష

చిత్తూరు, జూన్ 15 ప్రభాతవార్త: బడి ఈడు పిల్లలందరు బడిలోనే వుండాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. డిఆర్‌ఓ ఛాంబర్‌లో శనివారం డిఆర్‌ఓ బి.పుల్లయ్య డిఇఓ దేవరాజులు, సర్వశిక్ష అభియాన్ పిఓ వెంకటరమణారెడ్డిలతో కలిసి జులై 12వ తేదీ వరకు నిర్వహించనున్న నేను బడికి పోతా కార్యక్రమ నిర్వహణపై స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన, బిసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమశాఖలు, జిల్లా పంచాయతీ అధికారి, మెప్మా, కార్మిక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాట్లాడుతూ 6-14 సంవత్సరాల మధ్య బాలబాలికలందరు చదువుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నేను బడికి పోతా అనే కార్యక్రమంకు శ్రీకారం చుట్టిందన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఇంటింటికి వెళ్ళి 6-14 సంవత్సరాల మధ్య వున్న పిల్లలు బడికి వెళ్తున్నారా! లేదా! అని పరిశీలించాలన్నారు. బడికి వెళ్తూ మధ్యలో మానివేసి వున్న పిల్లలను గుర్తించి వారిని సమీపంలోని బడుల్లో చేర్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నేను బడికి పోతా కార్యక్రమంకు సంబంధించి జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారి, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కో-ఆర్డినేటర్లు చైర్మన్లుగాను వివిధ శాఖలకు సంబంధించి 14 మంది సభ్యులు వుంటారన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఓలు ఛైర్మన్లుగా, ఎంఇఓలు కన్వీనర్లుగా వ్యవహరిస్తూ పది మంది సభ్యులతో కమిటీ వుంటుందన్నారు. గ్రామ స్థాయిలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కమిటీ ఛైర్మన్‌గా, హెడ్మాస్టర్ కన్వీనర్‌గా కమిటీలో ఏడు మంది సభ్యులు వుంటారన్నారు. ఈ కమిటీలు జూన్ 13 నుండి జులై 12వ తేదీ వరకు వారి పరిధిలో ప్రత్యేక డ్రైవ్, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని సంబంధిత అదికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, బిసీ సంక్షేమ సాధికారత అధికారి రబ్బానీభాషా, సాంఘీక సంక్షేమశాఖ సాధికారిత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మీ, గిరిజన సంక్షేమ సాధికారత అధికారి మూర్తి, మైనార్టీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి, మెప్మా పిడి రాధమ్మ, సహాయ కార్మికశాఖ అధికారి జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కొల్లు, అచ్చన్నలకు పదవులపై పులికాట్ జాలర్ల సంబరాలు


మత్స్యకార నేత, రాష్ట్ర గనులు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన జాలర్లు

తడ, జూన్ 15 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రులకు శాఖలు కేటాయించిన తర్వాత తిరుపతి జిల్లా తడ మండల పరిధిలోని పులికాట్ సరస్సు జాలర్లు సంబరపడుతున్నారు. సరస్సు చుట్టూ ఒక్క తడ మండలంలోనే 16 కుప్పాలలో జాలర్లు నివసిస్తున్నారు. ప్రస్తుతం జాలర్ల నేత అయిన సీనియర్ టీడీపీ నాయకుడు, మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్రకు మంత్రి వర్గంలో ప్రాధాన్యత కలిగిన శాఖ లభించింది. గనుల శాఖతో పాటు ఎక్సైజ్ శాఖను రవీంద్రకు కేటాయించారు. పులికాట్ జాలర్ల సంక్షేమ సంఘం నాయకులు, ముఖ్యంగా టీడీపీ మత్స్యకార నాయకులకు కొల్లు రవీంద్రతో సత్సంబంధాలు ఉన్నాయి. ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో ఇక్కడి నుంచి కొందరు జాలర్ల నాయకులు మచిలీపట్నం వెళ్లి ఆయన గెలుపు కోసం కృషి చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత రవీంద్రను కలిసి శుభాకాంక్షలు చెప్పి వచ్చారు. తాజాగా మంత్రివర్గంలో కీలక శాఖలు దక్కడంతో మరోమారు రవీంద్రను కలిసి సన్మానించి పులికాట్ సరస్సు తీరం సమస్యలను పరిష్కరించాలని గుర్తుచేసి వచ్చారు. మరోవైపు ఇప్పటిదాకా టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కింజరపు అచ్చెన్నాయుడుకి కీలకమైన వ్యవసాయశాఖతో పాటు మత్స్యశాఖను కూడా కేటాయించడం ఇక్కడి జాలర్లకు ఆనందం తెచ్చింది. సమస్యలు అచ్చెన్నకు చాలాకాలంగా తెలుసని, ముఖ్యంగా బంగాళాఖాతం, పులికాట్ సరస్సు ముఖద్వారాల సమస్యను అచ్చెన్నాయుడు చొరవతో త్వరలోనే పరిష్కరించుకుంటామని జాలర్లు అంటున్నారు. ఇదిలావుంటే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలను కూడా పులికాట్ జాలర్లు కలిసి సన్మానించడంతో పాటు ఇక్కడి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## మంచులక్ష్మి దాతృత్వం

ఏర్పేడు, జూన్ 15 ప్రభాతవార్త : సినీనటుడు మోహన్‌బాబు సొంత గ్రామం మోదుగులపాళెంలో ఆయన కుమార్తె మంచులక్ష్మి టీచ్ ఫర్ ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్కూల్లో ఆన్‌లైన్‌క్లాస్ కోసం స్క్రీన్ ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచులక్ష్మి, తాను 24 ఏళ్లుగా స్నేహితులమన్నారు. ఆమె ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని కోరారు. మంచులక్ష్మి మాట్లాడుతూ నేను ఇప్పటి వరకు అనేక జిల్లాలలో టీచ్ ఫర్ ఛేంజ్ కార్యక్రమం చేశాం. మొదటిసారి పొలిటిషన్‌గా బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆహ్వానించామని, ఆయన హాజరవ్వడం చాలా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

# విధులతో పాటు... సంక్షేమానికి ప్రాధాన్యత

- పోలీసు శాఖకు ఏఆర్ విభాగం వెన్నుముక- ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, జూన్ 15 ప్రభాతవార్త: పోలీసులు విధుల నిర్వహణతో పాటు వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. ఏఆర్ పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఏఆర్, ఎస్‌టిఎఫ్, బిడీ టీమ్, డాగ్ స్క్వాడ్, హోమ్‌గార్డు సిబ్బందితో పెరేడ్ నిర్వహించారు. ఈ పెరేడ్‌కు ఎస్పీ మణికంఠ చందోలు ముఖ్య అతిథిగా హాజరై వారితో గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు సిబ్బంది బాగోగులు, ఉద్యోగ నిర్వహణలో వారు ఎదుర్కొం టున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఏఆర్ విభాగంలో ఉద్యోగ నిర్వహణ కష్టతరమైనదని, బాధ్యతాయుతమైనదని వారు నిర్వహించే ఎస్కార్టులు, బందోబస్తులు, గన్‌మెన్ ఉద్యోగ నిర్వహణలో ఎక్కడ నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. దీనికి శారీరకంగా, మానసికంగా ధృడంగా వుండటానికి తగిన వ్యాయామం చేయాలన్నారు. ఏఆర్ పోలీసు సిబ్బంది క్రమశిక్షణకు మారుపేరుగా వుండాలని, ఎలాంటి చెడు నడవడికకు అస్కారం లేకుండా విధులను చక్కగా నిర్వర్తించాలన్నారు. కవాతు ప్రదర్శన అందరు కలసికట్టుగా చేస్తేనే చూడటానికి అందంగా వుంటుందన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పోలీసు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఉద్యోగంను పనిగా కాకుండా ఒక అవకాశంగా భావిస్తే మునుపటి కంటే మెరుగ్గా పని చేస్తామన్నారు. నిన్నటి కంటే ఈ రోజు మరింత బాగా పని చేయాలని భావించి విధులు సక్రమంగా నిర్వర్తించేలా చూడాలన్నారు. అనంతరం ఎస్పీ మణికంఠ చందోలు ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో డ్యూటీ ఆర్‌ఎస్‌ఐ ఆఫీసు, బెల్ ఆఫ్ ఆర్మ్స్, బిడి టీమ్, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం, డిఎస్పీ ఆఫీసులు, ఎస్‌టిఎఫ్ రూమ్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆఫీస్ పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీలు మహబూబ్‌భాషా, ఇలియాజ్‌భాషా, ఆర్‌ఐలు భాస్కర్, సుధాకర్, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## శివయ్య సేవలకు పెరుగుతున్న భక్తులు: సుదర్శనంతో సంతృప్తి



శ్రీకాళహస్తి,జూన్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం వారాంతపు రద్దీ చోటు చేసుకుంటుంది. శనివారం అధికారికంగా అందించిన సమాచారం మేరకు సాయంత్రానికి 26వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దీంతో ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి సన్నిధివీధిలోని మూడువ, నాల్గవ గేట్ వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. రాహుకేతుదోష నివారణ పూజలకు సంబందించి భక్తులు తీవ్ర నిరీక్షణ చేయాల్సి వచ్చింది. వారం రోజులుగా ఆలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు చేయించుకునే మండపాల్లో తట్టలకు స్వస్తి చెప్పారు. కొత్త ప్రభుత్వంలో గెలిచిన శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆలయంలో పారదర్శక పరిపాలన అందించుటకు పలు సంస్కరణలను సూచించారు. అవి అమలు జరుగుతున్నాయి. శనివారం ఆలయానికి వచ్చిన భక్తులు ప్రశాంతంగా దర్శనాలు చేసుకుంటున్నారు. ఈవిషయంమే స్థానికులు కూడా చెబుతున్నారు.

రూ.200దర్శన టిక్కెట్లు 2046 రూ.50ల టిక్కెట్లు 2859 విక్రయించినట్లు సమాచారం గతంలో ఈ ఆదాయం కూడా దళారుల జేబుల్లో పోయేది. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి విఐపిల పేరుతో దళారుల దోపిడికి చెక్ పెట్టారు. దాంతో పిఆర్‌ఓ కార్యాలయం వద్ద ఉన్న సిబ్బంది టిక్కెట్లు కొనుగోలు చేసి వెళ్ళటం వల్ల ఆలయ ఆదాయం పెరుగుతుంది.

**గణనీయంగా రాహుకేతుదోష నివారణ పూజలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలకు గణనీయంగా ఉంది. శనివారం మధ్యాహ్నం వరకు అందిన సమాచారం మేరకు రూ.500ల టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్న వారి సంఖ్య 2662 మంది. రూ 750ల టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్న భక్తులు 1011, రూ.1500ల టిక్కెట్లుతో 328మంది., రూ.2500ల టిక్కెట్లు 245, రూ.5వేల టిక్కెట్లు కొనుగోలు చేసి వారు 72 మంది పూజలుజరిపించుకున్నట్లు ఆలయాధికారులు జారి చేసిన సమాచారం మేరకు తెలిసింది. ఇక అభిషేకాలు కకూడా గణనీయంగా జరిగాయి. అభిషేకాలు 77 మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం 36.శనీశ్వరాభిషేకాలు 85 రికార్డు స్థాయిలో నిర్వహించారు. ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు 5వేలు జరిగాయి. ఓ వైపు పూజలు జరుపుకునే భక్తులు మరో వైపు సామాన్య భక్తులు, ఇంకొక వైపు విఐపిల తాకిటితో కిట కిట లాడింది.

## ఎంబిబిఎస్ విద్యార్థులకు తర్ఫీదు



తిరుపతి హెల్త్, జూన్ 15 ప్రభాతవార్త: స్విమ్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో జూన్ 14,15వ తేదీలో శ్రీపద్మావతి వైద్య కళాశాల లెక్చర్ గ్యాలరీ నంఉ ఇఎం ఆంధ్రప్రదేశ్ 2024 పేరుతో రాష్ట్ర స్థాయి వార్షిక సదస్సు నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు మరియు తెలంగాణా రాష్ట్రాల నుండి సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు హాజరై వారి అనుభవాలను, సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ క్రిష్ణసింహారెడ్డి, డాక్టర్ ప్రకాష్ బాబు, రోహిత్‌గుప్తా, మెడిసిన్ విభాగం వైద్యులు, పి.జి విద్యార్థులు, ఎంబిబిఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆక్రమణల్లో రోడ్డు - ఇబ్బందుల్లో వాహనదారులు

-సర్వేలకే పరిమితమైన రోడ్డు విస్తరణ పనులు



చౌడేపల్లి, జూన్ 15 ప్రభాతవార్త : నిత్యం వాహనాలు, జనరద్దీ అధికంగా ప్రాంతం దురాక్రమణకు గురికా వడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారి, బస్టాండుకు కూతవేటు దూరంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డు దురాక్రమనకు గురికావడంతో ఇరుకుగా మారింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ఎదురుగా వాహనం వస్తే బస్టాండులో వేచి వుండాల్సి వస్తోంది. అలా కాకుండా బస్టాండు నుంచి వాహన వెళ్ళిందంటే ఎదురుగా వాహనం వచ్చిందంటే ఇక ట్రాఫిక్‌లో ఇరుక్కు పోవాల్సిందే. ఒక్కోసారి అత్యవసర సర్వీసులైన 108, అగ్నిమాపక వాహనాలు సైతం ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకొన్న దాఖలాలు అనేకం ఉన్నాయి. భారీ వాహనాలు ఎదురొస్తే బస్టాండు నుంచి దిగవబజారు వరకు వాహనాలు బారులు తీరితాయి. దీంతో చేసేదిలేక వాహనదారులు మేదరదొడ్డి, బజారువీధుల గుండా వెళ్ళాల్సివస్తోంది. రోడ్డు విస్తరణ పనులు చేస్తామని ఆర్ అండ్ బి అధికారులు పలుమార్లు మార్కింగ్‌లు వేసినా పనులు చేపట్టలేదన్న విమర్శలున్నాయి. ఇకనైనా అధికారులు బస్టాండు నుంచి బజారువీధి మలుపు వరకు గల రోడ్డు ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

## కలెక్టర్‌ను కలిసిన పూతలపట్టు ఎమ్మెల్యే



చిత్తూరు, జూన్ 15 ప్రభాతవార్త: పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ శనివారం కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను కలిసిన పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ కలెక్టర్‌కు శ్రీ వెంకటేశ్వరస్వామి చిత్రపటంను బహుకరించారు.

## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలిపిన సైకం



తిరుపతిరూరల్, జూన్ 15 ప్రభాతవార్త: తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు రాష్ట్ర సివిల్ సప్లయ్ మాజీ చైర్మెన్ సైకం జయచంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలియజేసారు. శనివారం ఎమ్మెల్యే శ్రీనివాసులను సైకం జయచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, దుశ్శాలవతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి, శుభాభినందనలు తెలిపారు. ఆరణి శ్రీనివాసులు తిరుపతి ప్రజల మనస్సులను గెలుచుకుని చరిత్ర తిరగరాసారని తెలిపారు. పుణ్యస్థలమైన తిరుపతి కీర్తిని నలుదిశల ఇమడింప చేసేలా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

## సూర్య నమస్కారాలు చేసి... రికార్డు సాధించిన వాసుదేవరెడ్డి



తిరుపతిరూరల్, జూన్ 15 ప్రభాతవార్త: ఆరోగ్యంపై వున్న ఆసక్తితో 72సంవత్సరాల వయస్సులో సూర్య నమస్కారాలు వైపు దృష్టి సారించేట్లు చేసింది. 57 నిమిషాలలో 108 సూర్య నమస్కారాలు చేసి ఇంటర్నెషనల్ బుక్‌ఆఫ్ రికార్డ్సులో ఎక్కారు. ఎలైట్ బుక్ రికార్డ్స్ (డిల్లీ) మోడల్స్, సర్టిఫికేట్ అందజేసినట్లు తెలిపారు. తిరుపతికి చెందిన టి.వాసుదేవరెడ్డి 2010లో ఫారెస్ట్ రెంజ్ అధికారిగా పదవీవిరమణ చేసారు. చిన్నతనం నుండి యోగాపై ఆసక్తి ఉండేది. ఉద్యోగ రీత్యా పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోయారు. పదవీ విరమణ అనంతరం పతంజలి యోగా సెంటర్‌లో శిక్షణ పొందారు. 2016లో హరిద్వార్‌లో రామ్‌దేవ్ బాబా పర్యవేక్షణలో యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్స్ పూర్తి చేసారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు



చంద్రగిరి, జూన్ 15 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంక ర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయ ంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు కె.ఎస్.ఆంజనేయాచార్యులు, సిబ్బంది సుబ్రమణ్యం, రవిచంద్రన్, ఘనాపాటి తిరువేంగాడం, జమేదర్ రమణయ్యా పాల్గొన్నారు.

## తోటి వేషంతో మిట్టగంగమ్మకు మ్రొక్కులు



చంద్రగిరి, జూన్ 15 ప్రభాతవార్త: దొర వేషధారణలతో భక్తులు శ్రీ మిట్టగంగమ్మ వారికి మ్రొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. చంద్రగిరిలోని శ్రీ మిట్టగంగమ్మ వారి జాతర వేడుకలు అంగరంగ వైభవంగా జాతర వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 5వ రోజు శనివారం ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బు స్వామి, అలంకరణ నిర్వహకులు ఉగ్రాణం సుబ్రమణ్యం రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం జరిపించారు. ఆలయ చైర్మన్ భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. చంద్రగిరికి చెందిన కార్వేటి సుబ్రమణ్యం రెడ్డి, చంద్రమోహన్, పి.వాసుదేవరావు, కోటకొండ్ల సాయి, భువనేశ్వరి ఉభయదారులుగా వ్యవహరించారు.

## కళలను ప్రోత్సహించండి..! ప్రతాప్ స్వామీజీ



రామచంద్రాపురం, జూన్ 15 ప్రభాతవార్త: మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిభింభించే కళలను ప్రోత్సహించాలని ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ అన్నారు. శనివారం కుప్పం బాదూరు పంచాయతీ, వడ్డికాల్వ గ్రామంలో కోలాట నృత్యోత్సవ గజ్జ పూజ ఘనంగా నిర్వహించారు. కోలాట భజన బృందానికి ఆయన నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారులను గుర్తించి ప్రోత్సాహకాలను అందించి ఆదరించాలన్నారు. రామాయణ, మహాభారత ఇతిహాసాలను కళల రూపంలో భావిభారత పౌరులకుఅందించే విధంగా కృషి చేయాలన్నారు.

## మరింత భక్తిభావం పెంచేలా నగరసంకీర్తన



తిరుపతి,జూన్ 15ప్రభాతవార్త: ఆధ్యాత్మికనగరం తిరుపతిలో స్థానికుల్లోనేగాక యాత్రికుల్లో కూడా భక్తిభావం పెంచేలా నగరసంకీర్తన కొనసాగిస్తు న్నట్లు రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. నగరంలో ప్రతిశనివారం ఉదయం చేపట్టే నగర సంకీర్తన ఆధ్యాత్మిక భజన కార్యక్రమం శనివారం ఉదయం 5గంటలకు గోవిందరాజస్వామి ఆలయం వద్దనుండి మొదలైంది. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు కెఎన్ రాజా, అక్కిపల్లి మునికృష్ణయ్య, సుబ్రమణ్య ంరెడ్డి, వాసురెడ్డి, తిరుపాలాచారి, చంద్రబాబూనాయుడు, కొండె చెంగారెడ్డి, శాంభోలు హరినాధ్, మునికుమారి, సుశీల, మహాలక్ష్మి, ఉషారాణి, కల్పన,నాగరాజు, నరసింహారెడ్డి, రాజశేఖర్‌లు నుదుటన తిరునామం ధరించి భక్తితో భజనలు, గోవింద నామాలతో ఊరేగింపు జరిగింది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## శివాలయం ఆదాయం రూ. 3.41.415 లక్షలు



పుత్తూరు, జూన్ 15 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీ కామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శనివారం నిర్వహించారు. ఈ ఏడాది జనవరి మూడో తేదీ నుంచి జూన్ నెల 15వ తేదీ వరకూ భక్తులు హుండీలో సమర్పించిన సొమ్ము రూ. 3,41,415 లక్షలు ఆదాయం వచ్చినట్టు ఇఒ తెలిపారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, నాయకులు మురళీకృష్ణ, దాము, జి.బబాబు, అయ్యప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో సత్తెనపల్లె ఎమ్మెల్యే కన్నా



కాణిపాకం, జూన్ 14 ప్రభాతవార్త: సత్తెనపల్లె ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట జిల్లా బిజెపీ అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు, ఉపాధ్యక్షుడు కెవి.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యలో విప్లవాత్మక మార్పులు : ఎమ్మెల్యే



వడమాలపేట, జూన్ 15 ప్రభాతవార్త: రాష్ట్రంలో అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి శ్రీకారం చుట్టారని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శనివారం వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే ఉత్తమ విద్యార్థులు తయారవుతారని, వారి ద్వారా రాష్ట్ర భవిష్యత్ మారుతుందని తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీకి పెట్టడం దీనికి నిదర్శనమన్నారు. సాంకేతికంగా అపార అనుభవం ఉన్న నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉండడం శుభ పరిణామం అన్నారు. తిరుపతి డీఈవో డా. శేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ ప్రకటించి తొలి సంతకం చేసినందుకు విద్యాశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈవో శేఖర్, పుత్తూరు డీవైఈవో ప్రభాకర్‌రాజు, ఎంఈవో పద్మావతి, తులసిరామ్, ప్రధానోపాధ్యాయులు కరుణ, నవనీతం, రఘురామయ్య, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్‌లు మునెమ్మ, మణిరాజు, నాయకులు ధనంజయనాయుడు, వెంకటయ్య, లక్ష్మిప్రసన్న, హేమావతి, విద్యా కమిటీ చైర్మన్ ధనంజయలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

శ్రీకాళహస్తి, జూన్ 15 ప్రభాతవార్త : రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్



కుటుంబసమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు దక్షిణగోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు అనంతరం ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయాధికారులు వీరికి మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో ఎంఈవో కార్యాలయ సిబ్బంది కెవి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.